## క్లుప్తంగా

### పీపీగా విఠల్ రావు నియామకం



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద జూనియర్ సివిల్ కోర్ట్ పీపీగా బిచ్కుందకు చెందిన విఠల్ రావు ఎంపికయ్యారు. బుధవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా విఠల్ రావు మాట్లాడుతూ.. అందరికి అందుబాటులో ఉండి పీపీగా సేవలు అందిస్తానని అన్నారు. న్యాయవాదులు మల్లేశ్, లక్ష్మణ్ రావు తదితరులున్నారు.

### రక్తదాన శిబిరం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు మొత్తం 60 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ.. సమయానికి రక్తం దొరక్క ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, తమ రక్తం అవసరం ఉన్నవారికి ఉపయోగపడితే ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన వారమవుతామని అన్నారు. అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు జగదీష్, సభ్యులు, ఆలయ పూజారి వివేక్ పంతులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

### బీజేవైఎం ఆధ్వర్యంలో..



కామారెడ్డి టౌన్: అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు పిలుపునిచ్చారు. నాయకులు విపుల్, నరేందర్, లక్ష్మారెడ్డి, భరత్, నరేష్, రవీందర్, నవీన్, సాయి, గోవర్ధన్ తదితరులున్నారు.

### మాతృమూర్తికి నివాళిగా 75వ సారి రక్తదానం



కామారెడ్డి అర్బన్: తన మాతృమూర్తికి నివాళిగా కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు బుధవారం 75వ సారి రక్తదానం చేశారు. బాలు తల్లి నీల విమల 12వ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేసి ఎమరాల్డ్ రక్తదాతల క్లబ్‌లో నమోదయ్యారు. యువతలో రక్తదానంపై ఉన్న అపోహలను వీడి నాలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. ఆరోగ్యంగా ఉండాలని, ప్రాణదాతలు కావాలని బాలు పిలుపునిచ్చారు. రక్తదాతల సమూహం ప్రతినిధి ఎర్రం చంద్రశేఖర్, నూర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం



రామారెడ్డి: నిజామాబాద్ జిల్లాలోని నందిపేట(ఆయుష్ విభాగం)లో ఆర్మూర్ నివాసి గడ్డమీది గిరిరాజ్, ఎస్ఎస్‌వోగా విధులు నిర్వర్తిస్తున్నారు. గిరిరాజ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో వారి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. కామారెడ్డి జిల్లా ఆయుష్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న తోటి ఉద్యోగులు, బాధిత కుటుంబానికి రూ. 22 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం ఆర్మూర్‌లో ఇంటికి వెళ్లి అందజేశారు. రామారెడ్డి గ్రామానికి చెందిన దోమల శ్రీధర్, ప్రసాద్ కామారెడ్డి జిల్లా తరపున వెళ్లి గిరిరాజ్ కుటుంబ సభ్యులకు అందించారు.

### రహదారి విస్తరణలో భాగంగా ఇళ్ల కూల్చివేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో బుధవారం ఇళ్లను కూల్చివేశారు. గ్రామ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సుమారు 50 ఏళ్ల క్రితం చేపట్టిన తాత్కాలిక ఇళ్ల నిర్మాణాలను ప్రొక్లెయిన్‌తో కూల్చి డ్రెయినేజీ పనులను చేపట్టారు. సుమారు 50 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన వంశీకృష్ణగౌడ్, శ్రీనివాస్ కుటుంబీకులు ఇళ్లను నిర్మించుకొని నివాసముంటున్నారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేయడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



సంగమేశ్వర గ్రామంలో..



భిక్కనూరు మండలం ఇసన్నపల్లి గ్రామంలో..



ఎల్లారెడ్డి సీఎస్ఐ చర్చిలో..

# ప్రేమ, త్యాగం ఏసుక్రీస్తు మార్గాలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో బుధవారం క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. ఏసు భూమిపై అవతరించిన సందర్భాన్ని పురస్కరించుకొని వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. చర్చిలన్నీ క్రైస్తవ భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక ప్రార్థనలు, బైబిల్ వచనాలతో చర్చిలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నారు. పాస్టర్లు, పాదర్లు దైవ సందేశం వినిపించారు. భక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ప్రముఖులు చర్చిలలో కేకులు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పలు చర్చిలతో అన్నదానం చేశారు. యేసు క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని, ప్రేమ త్యాగం ఆయన మార్గాలని పాస్టర్లు అన్నారు.



తాడ్వాయిలోని పెద్ద చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎస్సై వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు



మహమ్మద్ నగర్ చర్చిలో..



పిట్లం సీఎస్ఐ చర్చిలో..



బిచ్కుంద చర్చిలో..



పోచారం చర్చిలో..



లింగంపేటలో గీతాలు ఆలపిస్తున్న మహిళలు



బొమ్మన్‌దేవ్‌పల్లిలో..



బోర్లం గ్రామంలో..



జిల్లా కేంద్రంలోని వెస్లీ చర్చిలో..



బస్వాపూర్ చర్చిలో..

# సబ్ స్టేషన్ నిర్మాణం జరిగేనా..?

- పునాదులకే పరిమితమైన పనులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



మహమ్మద్ నగర్‌లో సబ్ స్టేషన్ నిర్మాణానికి వేసిన పునాది

నిజాంసాగర్(జుక్కల్): కరెంట్ కోతలు, బ్రేక్ డౌన్లు, గంటల తరబడి విద్యుత్తు సరఫరాలో అంతరాయాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసినా, నిర్మాణ పనుల జాడ మాత్రం కరువైంది. మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు ఏడాది కిందట మంజూరు చేసింది. అప్పట్లో అసెంబ్లీ ఎన్నికల వాతావరణం, కోడ్ నేపథ్యంలో సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు ముహూర్తం కుదరలేదు. ఎన్నికలైన 5 నెలలకు సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చేతుల మీదుగా భూమిపూజ చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి పునాదులు తీశారు. అనంతరం సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచాయి. సబ్ స్టేషన్‌కు పునాదులు తవ్వి, మట్టి తీసిన కాంట్రాక్టర్ నాల్గు నెలల నుంచి జాడ లేకుండా పోయాడు. ఆ వైపు ట్రాన్స్‌కో అధికారులు కూడా కన్నెత్తి చూడటం లేదు.

**కరెంట్ కష్టాలు తీరేదెప్పుడో..?**

మహమ్మద్ నగర్ మండల కేంద్రంతో పాటు గున్కుల్, బూర్గుల్, నర్వ, బొగ్గుగుడిసె, హసన్ పల్లి గ్రామాలకు నిజాంసాగర్ సబ్ స్టేషన్ నుంచి కరెంట్ సరఫరా చేస్తున్నారు. హెడ్‌స్లూయిస్ వద్ద ఉన్న సబ్ స్టేషన్ పురాతనమైనది కావడంతో పాటు ఫీడర్లు



అటవీ ప్రాంతం నుంచి ఉన్నాయి. దాంతో విద్యుత్ అంతరాయం ఏర్పడిన సమయంలో ట్రాన్స్‌కో సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. గంటల తరబడి కరెంట్ లేక రైతులు, విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంట్ కష్టాలను తీర్చేందుకు మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి సబ్ స్టేషన్ మంజూరు చేసింది. కాని సబ్ స్టేషన్ నిర్మాణ పనుల జాడ లేకపోవడంతో కరెంట్ కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

**కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం**

సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చాం. నిర్మాణ పనులు పునఃప్రారంభించాలని ఆదేశించాం. వారం రోజుల్లోగా పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రావణ్‌కుమార్, ఎస్ఈ, కామారెడ్డి

### రేపు ప్రమాణస్వీకారం

భిక్కనూరు: తిప్పాపూర్, కాచాపూర్ గ్రామాల్లోని దేవాలయాలకు ప్రభుత్వం నియమించిన పాలకమండలి సభ్యులు ఈ నెల 27న ప్రమాణస్వీకారం చేస్తారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు భీంరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ.. శుక్రవారం జరిగే తిప్పాపూర్ వేంకటేశ్వరాలయం, కాచాపూర్‌లోని వీరభద్ర దేవాలయానికి ప్రభుత్వం నియమించిన పాలకవర్గాల ప్రమాణ స్వీకారానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ హాజరవుతారన్నారు. కాంగ్రెస్ శ్రేణులు, భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

## ఆధ్యాత్మికం

### ముగిసిన మల్లన్న ఉత్సవాలు



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి మల్లన్న జాతర ఉత్సవాలు బుధవారం చక్రతీర్థం, మల్లన్న, మేడాలమ్మ, గొల్లకేతమ్మల నాగెల్లి పటాల ఉత్సవంతో ముగిశాయి. హుండీ ద్వారా రూ.80,682 లు వచ్చినట్లు వీడీసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గూడెల్లి గంగారాం, ద్యావరి నవీన్‌లు తెలిపారు. శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరేందర్‌రెడ్డి, దోమకొండ ఎస్సై ఆంజనేయులు, కౌన్సిలర్ కృష్ణాజీరావు, నాయకులు కాసర్ల రవీందర్, రాజు పాటిల్, వీడీసీ మాజీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, వంగ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

### మైసమ్మ, పోచమ్మ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



కామారెడ్డి అర్బన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని నీళ్ల ట్యాంకు సమీపంలో నూతనంగా నిర్మించిన మైసమ్మ, పోచమ్మ గ్రామ దేవతల ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ప్రారంభమై బుధవారం ముగిశాయి. వేదపండితులు జి.నారాయణశర్మ అంజనేయశర్మ, సంపత్‌కుమార్ శర్మ, సతీష్‌పాండే ఆధ్వర్యంలో చీటి పాండురంగారావు, రమ్యల సౌజన్యంతో ఉత్సవాలు నిర్వహించారు. శ్రీరామ కోటి జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, కాలనీవాసులు, పట్టణ ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికే బూత్ కమిటీలు



పొందూర్తి గ్రామంలో బూత్ కమిటీ సభ్యులతో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి తదితరులు

రాజంపేట: బీజేపీ బలోపేతానికే గ్రామ స్థాయిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పొందుర్తి గ్రామ బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి 154వ బూత్ అధ్యక్షుడిగా రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. అనంతరం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్ రెడ్డిల ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షుడిని సన్మానించారు.

**దేవునిపల్లి పోలింగ్ బూత్ బీజేపీ అధ్యక్షుల ఎన్నిక**

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి 10వ వార్డుకు సంబంధించి పోలింగ్ బూత్ బీజేపీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. 196వ బూత్ అధ్యక్షుడిగా కాసర్ల శేఖర్, 202వ బూత్ అధ్యక్షుడిగా నాగళ్ల స్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్ కుమార్, జిల్లా కార్యవర్గసభ్యులు కాసర్ల రవీందర్ పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**కొనసాగుతున్న చెరుకు క్రషింగ్**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. మంగళవారం నాటికి లక్షా 44 వేల 226 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు నవీన జ్యోతి, పీడీ సురేశ్‌లు తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అయేషా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని వారు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు.

**డిప్యుటేషన్ల ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం**

కామారెడ్డి టౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో వారి స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవరెడ్డి, సంతోష్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయమైన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. వెంటనే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**సర్వే పకడ్బందీగా నిర్వహించాలి**



బీబీపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీవో అబ్బాగౌడ్ అన్నారు. బుధవారం జనగామలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో 824 ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని ఇప్పటివరకు 440 పూర్తి అయ్యాయని తెలిపారు. అలాగే లబ్ధిదారుల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో పక్కాగా పొందుపర్చాలని సూచించారు. కార్యదర్శి కాశి కల్యాణ్ తదితరులున్నారు.

**పాలక మండళ్ల ఏర్పాటు**

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్, కాచాపూర్ గ్రామాల్లోని దేవాలయాలకు పాలకమండళ్లను ప్రభుత్వ ఏర్పాటు చేసింది. తిప్పాపూర్ వేంకటేశ్వరాలయానికి చైర్మన్‌గా మల్లుపేట భూమయ్య, వైస్ చైర్మన్‌గా వంగేటి సంజీవ రెడ్డి, సభ్యులుగా మంద శివరాజు, కొండ పెద్ద సాయిలు, ఐతారాము రజితలను నియమించారు. అలాగే కాచాపూర్ వీరభద్ర దేవాలయానికి చైర్మన్‌గా ఆకుతోట స్వామి, వైస్ చైర్మన్‌గా కత్రోజి వెంకటచారి, సభ్యులుగా తోగరి శ్రీనివాస్, మంగపల్లి రమేష్, ఊడెమ్ బాలమణిలను నియమించారు. ఈమేరకు దేవాదాయ శాఖ అధికారులు నియామక ఉత్తర్వులను జారీచేశారు.

# వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలి



బాన్సువాడలో వాజ్ పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



తాడ్వాయిలో ..



భిక్కనూరులో ..



రామేశ్వర్‌పల్లిలో ..



లింగంపేట మండల కేంద్రంలో..

సాక్షి నెట్‌వర్క్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. మాతృ భూమి కోసం తన జీవితాన్ని అంకితం చేసి దేశ అభివృద్ధికి బాటలు పరిచిన మహోన్నత వ్యక్తిని అని వాజ్‌పేయి అని కొనియాడారు. ప్రపంచానికి భారత శక్తిని చాటిన మార్గదర్శకులు అని అన్నారు. ప్రతి భారతీయుడు వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.



వాజ్‌పేయి జయంతి సందర్భంగా మద్నూర్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు



సదాశివనగర్‌లో..

# చారిత్రక కట్టడాలు పూర్వీకుల నైపుణ్యాలకు చిహ్నాలు



మెట్ల బావి వద్ద గడ్డం ఇందుప్రియ, కాంగ్రెస్ నేతలు

లింగంపేట(ఎల్లారెడ్డి): చారిత్రక కట్టడాలు మన పూర్వీకుల నైపుణ్యాలకు చిహ్నాలుగా చిరకాలం ఉంటాయని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావిని సందర్శించి మాట్లాడారు. చారిత్రక కట్టడాలను అభివృద్ధి చేయడం వల్ల నేటి తరానికి పర్యాటక కేంద్రాలుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. నాగన్నగారి బావికి పూర్వ వైభవం తెచ్చిన కలెక్టర్, రెయిన్ వాటర్ డెవలప్‌మెంట్ సంస్థ ఫౌండర్ కల్పనా రమేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం బావి పర్యాటక కేంద్రంగా మారడంతో సందర్శకుల తాకిడి పెరుగుతోందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. లింగంపేట పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, నాయకులు నగేష్, రాజు, ఎల్లమయ్య, ఏదుల్, అశోక్, శ్రీనివాస్, గోపాల్, కొడ రవి, మల్లయ్య పాల్గొన్నారు.

### రైతులు ఐక్యంగా స్పందించాలి



బాన్సువాడ రూరల్: రాజకీయ పార్టీలకు అతీతంగా రైతులు తమ సమస్యలపై సంఘటితంగా స్పందించాలని కిసాన్‌సంఘ్ ప్రతినిధులు కోరారు. బుధవారం వారు బాన్సువాడలో మాట్లాడారు. వ్యవసాయం నానాటికీ గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కిసాన్‌సంఘ్ రాష్ట్ర కార్యదర్శి అంబీర్ ఆనంద్‌రావు, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

### మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



కామారెడ్డి క్రైం: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. కొద్ది రోజులుగా పట్టణంలో వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కుటుంబ సభ్యులపై కేసులు పెడతామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు మరోసారి వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని చెప్పారు.

### ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై రగడ



ఒప్పంద పత్రాన్ని చూపుతున్న తండావాసులు

రాజంపేట: ఆరేపల్లి తండాలో ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పీర్యా అనే మాజీ ప్రజాప్రతినిధి 2018లో తన సొంత భూమి(3 గుంటలు) విరాళంగా ఇచ్చారు. ఎమ్మెల్సీ నిధులు రూ.2 లక్షలతో ఆ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఆ భూమిని ప్రస్తుతం నేను ఇవ్వను అంటూ ఆ ప్రజాప్రతినిధి మొండికేశారు. కొద్ది రోజుల క్రితం నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను కూల్చివేతకు పాల్పడ్డాడు. దీంతో తండావాసులు బుధవారం ఆందోళనకు దిగారు. దీంతో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. దీంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఇస్తానని ఒప్పుకొని పీర్యా ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడు. అనంతరం 15 రోజుల క్రితం పీర్యా మళ్లీ ఎస్టీ కమ్యూనిటీ హాల్‌ను పూర్తిగా కూల్చివేశాడు. దీంతో తండావాసులు ఆందోళన చేపట్టారు. వెంటనే అధికారులు స్పందించి ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: పట్టణంలోని 10వ వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను బుధవారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు రూ.3.05 కోట్లతో సాయికృపానగర్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రావు, తదితరులున్నారు.